
పడక కుర్చీలో వెనుక కొరిగి విశ్రాంతి తీసుకుంటున్నాడు వెంకటయ్య. అతని తల సగానికి పైగా నెరిసి ఉంది. ముఖంలో వృద్ధాప్యపు ఛాయలు ప్రవేశిస్తున్నాయి.

వెంకటయ్య ముఖంలో ఆనందం ఉంది. తన చిరకాల వాంఛ ఇప్పటికైనా తీరబోతున్నందుకు అతని కెంతో సంతోషంగా ఉంది. ఇన్నేళ్లకైనా తన కల నిజం కాబోతున్నందుకు ఎగిరి గంతెయ్యాలన్నంత ఉత్సాహంగా ఉంది.



# భూమిస్వప్నం

## కొలువ మల్లయ్య

'నేలంటే ఎంత ప్రేమ తనకు? భూమంటే ఎంత ప్రాణం? కాని, త నా నేలతల్లికే దూరమైపోయాడు. ఇన్నేళ్ల నిరీక్షణ తర్వాత తన స్వప్నం నిజం కాబోతోంది. తాను తన స్వగ్రామంలో పుట్టి పెరిగిన ఊళ్లో తన తండ్రి తాతల నుంచి సంక్రమించిన నేలలో ... తన స్వంత చేలో ... ఇంకొక అయిదారు నెలల్లో స్వంత ఇల్లు కట్టుకోబోతున్నాడు. ఊరు పెరగడం వల్ల ఒకప్పుడు ఊరికి కొంత దూరంగా ఉన్న చేను ఇప్పుడు ఊరు పక్కకైంది. ఆ చేలో ఇదివరకే ఓ బావి ఉంది. త నా బావిని మరికొంత తవ్వించి కరెంటు మోటారు పెట్టిస్తాడు. ఆ నేలతోపాటు మరికొంత కొంటాడు. తను ఆ నేలను దున్ని వ్యవసాయం చేస్తాడు ... కనీసం చేయిస్తాడు

ఉద్యోగరీత్యా తన కొడుకు జిల్లా ముఖ్య పట్టణంలో ఉంటున్నా, తను ఊళ్లో ఉంటాడు కాబట్టి పిల్లలతో మాటిమాటికీ వస్తాడు. కారణాలేవైనా తన కొడుకు పల్లె జీవితాన్ని కోల్పోయాడు. ఆ జీవితాన్ని కొడుకు పిల్లలకు చవిచూపుతాడు. కుటుంబ సభ్యులందరితో తను ఆ ఇంట్లో ఉంటాడు ... మనవడు, మనవరాలి నెత్తుకొని తను తోటంతా తిప్పుతాడు ... అన్ని సెలవులకూ పిల్లలు తన దగ్గరకే వస్తారు — కొడుకు, పిల్లలతో ప్రకృతి సౌందర్యం మధ్య తా నెంతో ఆనందం పొందుతాడు.

కొక్కొర కో అంటూ కూసే కోడి కూత తనను నిద్ర లేపుతుంది. పిట్టల కిచకిచ ధ్వనులు ... తెల్లవారుజామున చెట్లపై కూర్చుని అరిచే కాకుల అరుపులు తనకు మేల్కొలుపు పలుకుతాయి. పశువుల గిట్టల చప్పుడు తన చెవులను పునీతం చేస్తుంది. తను భూమిపుత్రుడు కాబోతున్నాడు ... చిరకాలంగా ఉన్న తన కోర్కెను వృద్ధాప్యంలోనైనా పూర్తి చేసుకోబోతున్నాడు!

చిన్నప్పుడు తన కొడుకును తనకు ప్రతిబింబంలా ఉన్నా డనేవారు. తనకు 'స్టాంపు'లాంటివా డనేవారు. అందుకే తన కొడు కొక్కడే తన నర్థం చేసుకున్నాడు. తన స్వగ్రామంలో భూమి కొనడానికి, ఇల్లు కట్టడానికి అంగీకరించాడు. తను అక్కడే ఉంటానంటే సరే నన్నాడు. వీలైనంత ఎక్కువగా తన భార్యా పిల్లలతో తన దగ్గరికి వస్తా నన్నాడు. అందుకే తాను వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. తన స్థానంలో కొడుక్కు ఉద్యోగ మిప్పించాడు. వాలంటరీ రిటైర్‌మెంట్‌తో వచ్చిన డబ్బంతా కొడుకు చేతిలో పోశాడు. కొడుకు తన ఇష్టప్రకారం తన ఊళ్లోనే ఇల్లు కట్టించి మరింత పొలం కొంటా నన్నాడు. ఇప్పు డా ప్రయత్నంలోనే ఉన్నాడు. ప్రస్తుతం పొలం గూర్చి మాట్లాడటానికే కొడుకు, భార్య ఊరు వెళ్లారు. ఈ రోజు వస్తారు. తను త్వరలోనే తన చిన్ననాటి స్నేహితులతో, సర్వసంపదలకు సృష్టికర్తలైన రైతులతో తన శేషజీవితం గడుపుతాడు.

తనకు ఇన్నేళ్లుగా అర్థంకాని విషయ మొకటి ఉంది. తన భార్య చదువుకున్నది. చదువుకున్నవాళ్ల కుటుంబంలో నుంచి వచ్చింది. ఆమెకు భూమి మీద ప్రేమ లేకపోతే లేకపోవచ్చు. స్నేహితుల మాట సరేసరి. కానీ, రైతుగానే పుట్టి పెరిగి జీవించిన తన తండ్రి తన నెందుకు భూమికి దూరం చేశాడు? భూమి, ఇల్లు తనది కాకుండా ఎందుకు చేశాడు? తనను తన స్వగ్రామంలో బతకొద్దని ఎందుకు శాసించాడు? ఎందుకు?

తన ఏభై ఏళ్ల పై జీవితం అతని మూసుకున్న కళ్లముందు అగుపడుతోంది ...



## బాలీవుడ్ బాణి

### 'ఫ్లాప్' అయినా టాప్

'అరబిక్ కడలందం' అంటూ ఉర్రూతలూపిన యాడ్ గర్ల్ సోనాలీ బెంద్రే ఓ అయిదు చిత్రాల్లో నటించినా, అవి ఫ్లాప్ అయినా ఆమె కెరీర్‌పై పెద్దగా ప్రభావం పడలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆమె సంచలన తార. హీరోలు సోనాలి సరసన నటించడానికి పోటీ పడుతున్నారు. సరోజ్‌ఖాన్ లాంటి ప్రసిద్ధ నృత్య దర్శకురాలు కూడా సోనాలి భంగిమలు చూసి ఆశ్చర్యపడిందట. రవీనా టాండన్‌లాగా సోనాలికి కూడా 'ఫ్లాప్' సినిమాలే కలసి వచ్చాయేమో !

మసూద్ అన్సారి

వెంకటయ్య తండ్రి నర్సయ్య రైతు. వాళ్ల తాతా ముత్తాతల కాలం నుంచి కూడా భూమిని నమ్ముకునే బతుకుతున్నాడు. మట్టిలో మట్టయి భూమిని సాగుచేస్తూ బతకడంలోని కష్టసుఖాలను బాగా అర్థం చేసుకున్నాడు నర్సయ్య. అందుకే ఎంత కష్టపడినా ఏడే మానికలన్నట్టు ఉన్న వ్యవసాయానికి కొడుకును దూరంగా ఉంచాలనుకున్నాడు నర్సయ్య. కొడుకును చదివించి ఉద్యోగిగా చూడాలన్నదే అతని కోరిక.

అయితే వెంకటయ్యలో తాత ముత్తాతల మూలా లున్నాయి. దానికితోడు 'ఎన్ని సంపాదించినా, ఎంత గొప్పవాడైనా, ఏ మనిషైనా బతకాలంటే తినేది అన్నమే. ఆ ఆహారాన్ని సృష్టించేది రైతు. ఎంత ఉన్నా ఎవరూ బంగారం తిని బతకరు' అని వెంకటయ్య మేనమామ పల్లెల గూర్చి ఎన్నోసార్లు అన్న మాటలు వెంకటయ్యపై చిన్నతనంలోనే గాఢ ముద్ర వేశాయి.

బడికి పోతున్నా వెంకటయ్యకు వ్యవసాయపు పనులు చేయడమంటే ఇష్టం ఉండేది. బడి లేని సమయాల్లో ఎడ్లను మేపుకొచ్చేవాడు, మోట కొట్టేవాడు, పెరడికి నీళ్లు కట్టేవాడు, నాగలి దున్నేవాడు. ఆ పనులు చేస్తూ ఎంతో ఆనందం పొందేవాడు.

సంక్రాంతి పండుగ వస్తే ఎంతో సంబరపడిపోయేవాడు వెంకటయ్య. తనే ఆవుపేడ తీసుకొచ్చేవాడు, గొబ్బిళ్లు తయారుచేసేవాడు, వాటికి గరకపోచల్లాంటివి కుచ్చేవాడు. చెల్లెలు వాకిట్లో, ఇంట్లో ముగ్గేసి గొబ్బిళ్లు పెడుతుంటే తాను నవధాన్యాలు పోసేవాడు. సాయంత్రం వరకు ఎడ్లను అలంకరించేవాడు. కొమ్ములకు రంగు పూసేవాడు, వాటి శరీరాలమీద రంగులో ముంచిన చేతితో చరిచేవాడు. ఎంతో ఉత్సాహంగా ఎడ్లను కాటిరేవులు జరిపేచోటికి తోలుకెళ్లేవాడు. అందరికంటే ముందే తోరణం కింది నుంచి తన ఎడ్లనే పరుగెత్తించేవాడు. ఆ రోజు ఎడ్ల పండుగ అని మురిసిపోయేవాడు.

ఊళ్లో చిందు భాగవతులు, మిత్తిరయ్యవార్లలాంటి వాళ్లు భాగోతం ఆడుతుంటే తెల్లవార్లూ అక్కడే ఉండి చూసేవాడు. కొడుకును దొరబాబులా చూడాలనుకుంటున్న నర్సయ్యకి ఇవన్నీ నచ్చేవి కావు.

"అన్నీ లేకిడి బుద్ధులు, పిచ్చి పిచ్చి అలవాట్లు! చదువేస్తే ఉన్నమతి పోయినట్టుంది నీ కథ!" అని తిట్టేవాడు నర్సయ్య.

"మా అమీన్ సా బత్తండు! మా తాసిల్దా రత్తండు! నా మనుమడు తాలుకదా రైతడు!" బడి నుంచి వచ్చే మనవణ్ని దగ్గరకు తీసుకుంటూ అనేది వెంకటయ్య నానమ్మ.

"ముసల్దాన! పో! నే నమీన్ సాబ్‌ను కానే కాను!" అనేవాడు వెంకటయ్య.

"మ రేమవుతవురా?" ఒకసారి అడిగాడు వెంకటయ్య చిన్నాన్న.

"నే నేం గాను, వ్యవసాయం చేస్తా!" అన్నాడు వెంకటయ్య.

"ఛీ! గూద గాడిదికె! చదువుకొని ఎవుసం జేత్తవు!" అన్న చిన్నాన్న మాటలను ఖండిస్తూ "నేను వ్యవసాయమే చేస్తా!" అన్నాడు వెంకటయ్య.

"ఆఁ, ఇక ఈ మొగోడు చేస్త డెవుసం? ఎవుసం చేసి చేసి మేం పొడుగైనం, ఇ గీ పెద్దమనిషి చేస్తడు! ఎవుసం చేసేదానికి గీ చదువుల న్నెందుకు?" కొడుకును మందలించినట్టన్నాడు నర్సయ్య.

వెంకటయ్య చెల్లెకు చిన్నతనంలోనే పెళ్లయింది. ఊళ్లో ఉన్న హైస్కూలు చదువు పూర్తి చేశాడు వెంకటయ్య. ఆ రోజు చివరి రోజు. వెంకటయ్య తరగతి వాళ్లందరినీ సమావేశపరిచాడు ప్రధానోపాధ్యాయుడు. మిగతా ఉపాధ్యాయు లంతా ఉన్నారు. విద్యార్థులు తాము భవిష్యత్తులో ఏం చేస్తారో, ఏం కావాలనుకుంటున్నారో ఒక్కొక్క రే వచ్చి మాట్లాడమన్నాడు ప్రధానోపాధ్యాయుడు. వెంకటయ్య తరగతి వాళ్లు ఒక్కొక్క రే లేచి మాట్లాడుతున్నారు.

"నాకు లెక్కలంటే ఇష్టం. నేను ఇంజనీరింగ్ చదువుతాను. పెద్ద పెద్ద ప్రాజెక్టులు గట్టిస్తాను. దేశానికి సేవ చేస్తాను."

"నేను ఇంకా ఇంకా చదివి ప్రిన్సిపాల్ నవుతా!"

"నేను బడిపంతులునై పాఠశాలలను బాగా నడిపిస్తాను."

"నేను డాక్టర్నై పేదవాళ్లకు ఉచితంగా వైద్యం చేస్తాను."

"నేను కలెక్టర్ నవుతా!"

"నాకు కండక్టర్ ఉద్యోగం దొరికినా చాలు!"

రకరకాలుగా చెబుతున్నారు విద్యార్థులు. ఇప్పుడు వెంకటయ్య వంతు వచ్చింది.

"నే నెంత చదువుకున్నా ఊళ్లోనే ఉంటాను. వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసి పంటలు బాగా పండిస్తాను. రైతే రాజని నిరూపిస్తాను!"

ఆ మాటలు విని అంతా ఆశ్చర్యపోయారు. చదువులో మంచి ఇంటెలిజెంట్ అయిన వెంకటయ్య అలా మాట్లాడటం ఎవరికీ నచ్చలేదు.

"వ్యవసాయం చేస్తాడట! వ్యవసాయం! అయితే చదు వెందుకు?" అని హెడ్మాస్టర్, ఉపాధ్యాయులూ తిట్టారు.

పల్లెటూళ్ల గురించి, రైతుల గురించి పాఠాలు చెప్పేటప్పుడు ఎంతో గొప్పగా చెప్పిన ఉపాధ్యాయులు తనను అభినందించాల్సింది పోయి, తిట్టడం వెంకటయ్యకు బాధాకరంగా ఉంది. ఒక్క హిందీ సారు మాత్రం తనను ప్రశంసాపూర్వకంగా చూడటం గమనించాడు వెంకటయ్య.

హెడ్మాస్టర్ వెంకటయ్య మాటల గూర్చి నర్సయ్యతోనూ చెప్పాడు.

'పిల్లగాండ్ల మాటల కేంలే!' అనుకున్నా, కొడుకుని పిలిచి చీవాట్లు పెట్టాడు.

"చిన్నప్పుడంటె చిన్నతనం ... తెలవక అన్నవనుకున్న! ఇప్పుడు పెద్దోనివైతన్నవు. ఇంకా ఎవుస మెవుస మనే అంటున్నవా? నీ క్కొంచెమన్న బుద్ధుందా? ఈ పన్లేసి మేం సంపాయించింది చాలదా? మల్లె మన్నె బొర్లినా మా బతుకులు గిట్లనే ఉంటున్నయ్యి! పదారేండ్లు ముడ్డికింది కచ్చినయి! ఇంకా పిల్లగా న్ననుకుంటున్నవా?"

తండ్రి మాటలకు ముఖం మాడ్చుకున్నాడు వెంకటయ్య.

• • •

డిగ్రీ పూర్తయిన కొన్ని నెలల్లోనే జిల్లా కేంద్రంలో ఉద్యోగమైంది. పెళ్లి చేసుకోమన్నాడు తండ్రి.

డిగ్రీ చేస్తున్న సమయంలో చదివిన కిన్నెరసాని, ఎంకిపాటలు, దువ్వూరి సాహిత్యం ప్రభావం ఉంది వెంకటయ్యపై. చిన్నతనం నుంచీ మేనమామంటే గౌరవ భావముంది. తన ఉద్దేశ్యాలకు తగిన అమ్మాయి మేనమామ కూతురే ననుకున్నాడు.

"నాన్నా! నేను మామ బిడ్డనే పెళ్లి చేసుకుంటాను. ఆమె అయితే అవసరాల్లో మీకు వ్యవసాయ పనులలో సాయపడుతుంది."

కొడుకు మాటలు విని ముఖం చిట్లించాడు నర్సయ్య. అతని ఉద్దేశం మరో విధంగా ఉంది.

"ఉద్యోగమైనా నీ తలకాయ మారలేదా? ఊరోల్లు ఊరోల్లనుకుంట ఏం జేత్త ననుకుంటున్నవు? నీకు నౌకరుంది. చదువుకున్నదాన్ని చేసుకో! కట్నం గూడ బాగనే వస్తది. మీ మామేమిస్తడు?"

ఈ విషయంలో తండ్రి నుంచి వ్యతిరేకత రావడం అసహజ మనిపించింది వెంకటయ్యకు. తండ్రి చేసుకొమ్మంటే తను కాదనాల్సింది పోయి అందుకు భిన్నంగా జరగడం అతనికి బాధాకరంగా ఉంది. తల్లి తండ్రి నెదిరించలేకపోవడం గమనించాడు వెంకటయ్య.

"నీ కేం కర్మ ఆ పల్లెటూరి పిల్లను చేసుకోవడం? గోచీ పెట్టుకుని ఆమె నీ ఇంట్లో ఉంటే నీ కెలా ఉంటుంది?" అన్నారు మిత్రులు.

అందరినీ కాదని నిర్ణయం తీసుకోవడం ఇష్టం లేక హెచ్చెస్సీ చదివిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు వెంకటయ్య.

పట్టణంలో ఉద్యోగమైనా పది పదిహేను రోజుల కొకసారి ఊరు వెళ్లి వస్తున్నాడు. ఈ మధ్య కొద్దిమంది వ్యవసాయాలు వదిలిపెట్టి పోవడం చూస్తున్నాడు.


వెంకటయ్య మరికొంత భూమి కొని వ్యవసాయం అభివృద్ధి చేయాలని ఆలోచిస్తుంటే నర్సయ్య ఎడ్లమ్మి వ్యవసాయం చేయడం మానేశాడు. బండలపై కూర్చుని కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నాడు.

## బాలీవుడ్ బాణీ

### పిల్లల సీజన్

హిందీ చిత్ర రంగంలో ప్రస్తుతం ప్రెగ్నెంట్ సీజన్ నడుస్తున్నది. అమృతాసింగ్, బిందియా గోస్వామి, పూనమ్ ధిల్లాన్ పండంటి పిల్లలకు తల్లులు కాబోతున్నారు. వారిలో అమృతాసింగ్ రేపో మాపో తల్లి కానుండగా, మిగతా వారికి కొంచెం సమయం పట్టనున్నట్లు వార్త. గోవింద భార్య సునీత, సునీల్ శెట్టి శ్రీమతి మనా కూడా తల్లులు కాబోతున్నారట. కనుక చిత్ర రంగానికి బుల్లి హీరోలూ, హీరోయిన్లూ అవతరించబోతున్నారన్న మాటేగా?

మసూద్ అన్సారి



తండ్రి వ్యవసాయం మానడం గూర్చి అడిగాడు వెంకటయ్య. కొడుకుని చూసి నవ్వాడు నర్సయ్య.

"వ్యవసాయం చెయ్యొ మనేటోన్ని ని న్నొక్కన్నే చూసిన. నౌకరైన కొడుకు లందరేమొ తండ్రులను ఎవుసాలు బందుజెయ్యిమంటుంటె నువ్వేమో చెయ్యమంటన్నవు! నీ కింకా బుద్ధి రానట్టుంది. అయినా నీకు నౌకరైనంక ఎవుసం చేసుకోటానికి నా కేం కర్మ?" ధీమాగా అన్నాడు.

"మిమ్మల్ని సాదలేనని కాదు. మన కింత భూముండె కనీసం పాలేర్ను పెట్టుకొనైనా చేయొచ్చు కదాని. వ్యవసాయ మున్నింట్లో అన్ని రకాల ధాన్యమవీ దొరుకుతాయి" అన్నాడు వెంకటయ్య.

"ఎవుసంల ఏముందో చెప్పు? బొక్కలన్ని కలికలికొంగ పన్జేత్తె మిగిలేది అల్లికల్లి సున్నకు సున్న. కైకిలిగూడపడుతెక్కువే. పాలేర్లమన్న మునుపటి 'తీరుగ దొరుకుతండ్రా? అయినా భూమేపాటి మిగిలిందని ఎవుసం చేసుడు? చెల్లె కట్నానికి, పెట్టుపోతలకు, నీ చదువుకు, ఇతర బాకీల కిందకి పొలం, భూమి అమ్ముడు పోయినయి. రెండకరాల చేను, ఎకరం పొలం మిగిలింది. దాంతోని ఏ మెవుసం చేసుడు?"

భూములు అమ్ముడుపోవాల్సిన పరిస్థితి లేం లేవని వెంకటయ్యకు తెలుసు. అందువల్ల తండ్రి మాటలు నమ్మబుద్ధి కాలే దతనికి. అయినా తండ్రితో తగాదా పెట్టుకోదలుచుకో లేదు.

మరి కొన్నేండ్లు గడిచాయి. పిల్ల లెదుగుతు న్నారు. అప్పుడప్పుడు ఊరెళ్లి వస్తున్నాడు. తల్లిదండ్రులకు ఖర్చులకోసం నెలకు కొంత డబ్బు పంపిస్తున్నాడు. ఊళ్లో భూమి కొనే సమయం కొర్కకెదురు చూస్తున్నాడు.

ఈ మధ్య తండ్రి వెంకటయ్యతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్నాడు. వెంకటయ్య భార్య చెపుతున్నా వినకుండా ముప్పై వేల రూపాయలు తండ్రి చేతిలో పెట్టి మంచి పొలం కొనమన్నాడు.

కొడుకు నదోలా చూశాడు నర్సయ్య.

"సరే! మనమై అడిగితే ధరెక్కువ చెపు తారు. నువ్వు రెండు మూడు నెలల తర్వాత రా. అప్పటి వరకన్ని చేస్త" అని పంపించాడు వెంకటయ్యను.

ఆ తర్వాత ఇంటి కెళ్లిన వెంకటయ్య భూమి విషయం కదిపాడు.

"బావచ్చి ఆ పైసలు తీసుకు పొయిండు. చెల్లెకు చిన్నప్పుడే లగ్గంజేత్తిమి. అప్పుడేపాటి కట్న మిచ్చినం మనం? అప్పు డంటె నీకు నౌకరి లేకపాయె. బావచ్చి పొలం కొనుక్కుంట నని ఆ పైసలు తీసుకపొయిండు. నాగ్గూడ సరె ననిపించింది" అన్నాడు నర్సయ్య

"చెల్లె కప్పు దేమిచ్చినం బిడ్డా! నీ కింత నౌకరుండె. అదేమొ మోటు కష్టం చేసుకుంట బతికేదాయె. అల్లకున్న భూమి కొంచెమే

నాయె. ఇంకింత భూమి కొనుక్కుంటరేం బాయెననని ఇచ్చినం" అంది తల్లి.

తల్లిదండ్రుల మాటలు షాక్‌లా ఉన్నాయి వెంకటయ్యకు. కొద్ది క్షణా లాతని నోటి వెంట ఒక్క మాట కూడా రాలేదు.

"అది కాదమ్మా ! భూమి కొనమనిస్తే" అన్నాడు.

"భూమి కంటె నువ్వచ్చి దున్నుతవా? నాయనన్నకు గూడ సాతగాకుంటపాయె. భూమేం జేత్తది చెప్పు?" అంది తల్లి.

"నేను చెల్లెకు ఎప్పుడూ ఏదో కొంత ఇస్తూనే ఉన్నాను. కదమ్మా. మీ రెందు కిలా చేశారు?" కోపంగా అన్నాడు.

ఆ మాటలు విని వెంకటయ్య తల్లిదండ్రులు రకరకాలుగా నిష్ఠూరాలాడారు. వాళ్ల నేమన లేక వెళ్లిపోయాడు.

జరిగిన విషయం తెలుసుకుని నానా గొడవ చేసింది వెంకటయ్య భార్య. అంత డబ్బు పోయిందని తిట్టింది. మొత్తుకుంది. ఏడ్చింది. తన పిల్లల కన్యాయం చేస్తున్నాడని ఆరోపించింది.

"మళ్లీ భూమి గీమన్నారంటే నే నురిపోసుకుని చస్తా. నేను చచ్చిం తర్వాత మీ ఊళ్లో భూమి కొనుక్కోండి." తెగేసి చెప్పేసింది.

ఆ తర్వాత వెంకటయ్య తరుచుగా ఊరెళ్లడాన్ని నిరోధించిం దాతని భార్య. ఊళ్లో భూమి కొనాలన్న వెంకటయ్య ఆశలు అలా భగ్నమయ్యాయి.

చేస్తున్న ఉద్యోగం ఫర్వాలేదు. జీతం సరే. అయినా వెంకటయ్య కెందుకో అసంతృప్తిగానే ఉంది.

'తండ్రి ఉన్నన్ని రోజులు ఎలాగూ సాగనివ్వడు.ఊళ్లో తన కింత భూముంది. ఇల్లుంది. ఆ తర్వాతైనా తా నా ఇల్లుమ మంచిగ చేసుకోవాలి. ఇంకొంత భూమి కొనుక్కోవాలి' అనుకున్నాడు.

ఒక్కోసారి తండ్రి తొందరగా పోయినా బాగుండేదనుకోకపోలేదు.


కొన్నేళ్లు గడిచాయి. ఈలోగా తండ్రి జబ్బు పడ్డాడు. అదే సమయంలో వెంకటయ్యకు దూర ప్రాంతానికి బదిలీ అయ్యింది. అప్పుడప్పు డూరెళ్లి తల్లిదండ్రులను చూసొస్తున్నాడు వెంకటయ్య. ఊరి పక్క ఊళ్లో ఉన్న వెంకటయ్య చెల్లెలు తండ్రి నరుసుకుంటుంది.

ఈ మధ్యనే నర్సయ్య చనిపోయాడు. పోతూ పోతూ ఇల్లు పొలం కూతురుకు చెందేట్టు వీలునామ రాసి రిజిస్టర్ చేసి మరీ పోయాడు.

ఆ విషయం తెలుసుకుని తల కొట్టుకున్నాడు వెంకటయ్య.

ఇదేంటని తల్లి నడిగాడు.

"బిడ్డా ! నీకు మంచి నౌకరుంది. నువ్వు కసూర్లల్లనే ఉంటవు. ను వ్వచ్చి ఈ ఊల్లె ఉంటవా చెప్పు? ను వ్వంటనన్నా నీ పెండ్లాం, పిల్ల లిక్కడుండరు. చెల్లె ఎవుసం చేసుకుంట బతుకుతది. దాన్ది మన పక్కూ రేనేయె. దగ్గరుండి నాయిన్న నరుసుకుంది. సేవ చేసింది.



## బాలీవుడ్ బాణీ

### అమాయకుడి పాత్రలో అనిల్..

ఆంగ్రీ యంగ్‌మాన్ పాత్రల వల్ల లాభం లేకపోవడంతో అనిల్‌కపూర్ సరికొత్త పాత్రల అన్వేషణలో పడిపోయాడు. ఈసారి ఆస్కార్ అవార్డులను అత్యధిక సంఖ్యలో గెలుచుకున్న 'ఫారెస్ట్ గంప్' చిత్రాన్ని హిందీలో రీమేక్ చేస్తున్నారు. ఆ చిత్రంలో అనిల్ అమాయకుడి పాత్రలో కనిపిస్తాడు. దాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాల్సిందే !

మసూద్ అన్సారి

రేపు నా గ్గూడ చేస్తది. నాయన్న రాసిన వాటి జోలికి పోకు. అదెవ్వలు నీ తోడ బుట్టిందే నాయె" అం దామె.

కొందరేమొ జబ్బు పడున్నప్పుడు రాసిన వీలు చెల్లదన్నారు. ఇల్లుపై హక్కును వదులుకోవద్దన్నారు. ఇంకొందరు పోనీలే అన్నారు.

ఎవరేమన్నా తన స్వంత ఊర్లో, తాను పుట్టి పెరిగిన గ్రామంలో తాను ప్రాణాధికంగా ప్రేమించిన పల్లెలో తనకు స్వంత ఇల్లంటూ లేకపోవడం బాధాకరంగానూ, అవమానకరంగానూ ఉంది వెంకటయ్యకు. తాను ఊళ్లో మరింత భూమి కొనుక్కుందామనుకుంటే ఉన్న ఇల్లు, పొలం కూడా పోవడం తలతీ సేసినట్టుగా ఉంది వెంకటయ్యకు.

ఊళ్లో ఇల్లు గురించి భార్య నడిగాడు వెంకటయ్య.

"ఆ ఇల్లును వదిలిపెట్టొద్దు. ఎలాగైనా సరే దాన్ని మనం స్వాధీనం చేసుకుని అమ్ముకుంటే అరవై డెబ్బై వే లొస్తాయి. ఆ పొలాన్నుంచుకుని మీ చెల్లె మీ అమ్మను చూసుకుంటుంది" అం దామె.

భార్య మాటలతో విరక్తి లాంటి దొచ్చింది వెంకటయ్యకు. వెంకటయ్య భార్య ఆ ఇల్లు నుంచుకుని, భవిష్యత్తులోనైనా అక్క డుందామంటే కోర్టు కెళ్లైనా, ఇంకే విధంగానైనా ఆ ఇల్లును చేజిక్కించుకోవా లనుకున్నాడు. భార్యా మాటలనేసరికి తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు.

'ఆ ఇల్లు చెల్లెకుంటే కనీసం చుట్టపు చూపు గానైనా అప్పుడప్పు డా ఇంట్లోకి రావచ్చు. తన కొస్తే దా న్నమ్మివేయందే ఊర్కోదు తన భార్య.'

బాగా ఆలోచించాడు వెంకటయ్య. తల్లి పోషణా భారాన్ని చెల్లె చూసుకునే షరతుపై ఇల్లును, పొలాన్ని వాళ్లకే చెందేట్టు తండ్రి రాసిన వీలును ఒప్పుకుంటూ సంతకాలు పెట్టాడు.

ఇంకేం మాట్లాడలేదు వెంకటయ్య.

అయితే చిన్నప్పట్నుంచీ భూమిపై, వ్యవసాయంపై, పల్లెలపై పెంచుకున్న మమకారం వెంకటయ్యను వెంటాడుతూనే ఉంది. చిత్రాతి విచిత్రంగా అన్ని దశల్లోనూ తన కోర్కెలు భగ్నం కావడం వెంకటయ్యకు విచిత్ర మనిపిస్తుంది. ఎవరేమన్నా రిటైర్‌మెంట్ తర్వాతైనా తా ననుకున్నది చేయాలని తనను తాను సమాధానపరుచుకున్నాడు.

మరో మూడేళ్లు గడిచాయి. వెంకటయ్య కొడుకు డిగ్రీ, టైపు హయ్యర్ పాసయి ఖాళీగానే ఉంటున్నాడు. వెంకటయ్య కొడుకు, కూతు రిద్దరికీ పెళ్లయింది.

కొడుకును ఖాళీగా చూస్తున్న వెంకటయ్యకో ఆలోచ నొచ్చింది. ఈ విధంగానైనా తన కోర్కె నెరవేరితే మంచిదే ననుకున్నాడు. కొడుకును దగ్గరకు పిలుచుకున్నాడు.

"నా కింకో ఐదున్నరేళ్ల సర్వీసుంది. నా ఆరోగ్యం కొంత వెనుకకు బడుతుంది. నువ్వు కూడా నిరుద్యోగిగా ఉంటున్నావు. ఈ రోజుల్లో ఉద్యోగం రావడ మంత సులభం కాదు. నేను వాలంటరీ తీసుకుని ని న్నాస్థానంలో పెట్టించా లనుకుంటున్నాను."

ఈ కాలంలో ఉద్యోగాన్ని కాదనే వాళ్లెవరు?

"మీ ఇష్ట మున్నట్టే కానియ్యండి" అన్నాడు ఆనంద్.

"కాని, ఒక్క షరతు."

తండ్రి దిక్కు ప్రశ్నార్థకంగా చూశాడు ఆనంద్.

"నే నెంతో కాలంగా అనుకుంటున్నదే. వచ్చే డబ్బులోంచి కొంత మన ఊళ్లో చిన్న ఇల్లు కట్టించడానికి ఖర్చు చేయాలి. మరి ఇంత డబ్బుతో కొంత పొలం కొనాలి. మిగతాది మీ ఇష్ట మున్నట్లు వాడుకోండి. నాకు పెన్షన్ రాకున్నా నువ్వు డబ్బు పంపాల్సిన అవసరం లేదు. నే నూళ్లోనే ఉంటాను. మీ ఇష్టమైతే నాతో ఉండండి. లేకుంటే లేదు."

తండ్రి మాటల గూర్చి రెండు రోజులు తల్లితో ఏవేవో చర్చించాడు ఆనంద్.

"మీ రన్నట్టే చేస్తాను నాన్నా ! మీ రొక్కరేం

కర్మ? వీలైనన్ని రోజులు నేను నా పిల్లలతో పాటు ఊళ్లోనే గడుపుతాను."

కొడుకు మాటలు విని ఎగిరి గంతేశాడు వెంకటయ్య. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని కొడుకును ఉద్యోగంలో పెట్టించాడు. వచ్చిన డబ్బంతా కొడుకు చేతిలో పోశాడు.

• • • •

వెంకటయ్య మన సిప్పుడు తేలికైంది. కుర్చీలోంచి లేచాడు. మూత్రాని కెళ్లొచ్చి కాళ్లు చేతులు కడుక్కున్నాడు. మంచినీళ్లు తాగి మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు.

తాను జీవిత కాలమంతా భూమి కొరకే తపించాడు. భూమి గురించి కలలు గన్నాడు. తన ఇన్నేళ్ల 'భూమి స్వప్నం' కొడుకు తన నర్థం చేసుకోవడం వల్ల నిజం కాబోతున్నందు కానందంగా ఉంది వెంకటయ్య.

బాల్యాన్ని జ్ఞాపకం చేసుకుంటూ, పల్లెల గూర్చి ఏవేవో ఊహించుకుంటూ కొడుకు రాక కోస మెదిరి చూస్తున్నాడు వెంకటయ్య.

మరో గంట తర్వాత ఊర్నుంచి వచ్చారు ఆనంద్, రాధ.

"బస్సు లేటయిందా ఆనంద్?"

"అవును నాన్నా" అని తండ్రి కెదురుగా కుర్చీలో కూర్చున్నా డానంద్.

"ఊళ్లో అంతా బాగానే?"

"ఆఁ.. ఆఁ..." నీళ్లు మింగినట్టన్నాడు ఆనంద్.

"మన చేను పక్క నున్న భూమి నమ్మడానికి వాళ్లు ఒప్పుకున్నారా? మన మెలాగూ కొంటామని ఎక్కువ ధర చెప్పుంటారు."

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం" అని లేవబోయా డానంద్.

"తర్వాతేమిటి? ఈ ఒక్క మాట చెప్పడానికి కష్టమవుతుందా?" కొడుకు ననుమానంగా చూస్తూ అన్నాడు వెంకటయ్య.

"నాన్నా? మీరు మరోలా అనుకోవద్దు."

"వాళ్లు భూ మివ్వడానికి ఒప్పుకున్నారా అని నే నడుగుతే మరోలా అనుకోవడమేంటి? ఏమైందో చెప్పలేవు."

"ఊళ్లో మనకున్న ఆ రెండకరాల భూమినీ అమ్మేశాను."

ఆనంద్ మాటలు విన్న వెంకటయ్య తలపై పిడుగుపడ్డట్టయింది. కొద్ది క్షణా లాతని నోటి నుంచి ఒక్క మాటా రాలేదు. ఆతని ముఖంలో బాధా, కోపం కలగాపులగంగా ఉన్నాయి.

"ఏంటి ను వ్వనేది? భూమిని కొన్నావా అనడిగితే అమ్మానంటావేంటి?" కోపంగా అన్నాడు వెంకటయ్య.

"నాన్నా ! మే మా పని చేసింది మన మంచి కోసమే."

"ఏంట్రా మన మంచి? ని న్నెవ్వడమ్మమన్నార్రా భూమిని?"

"నాన్నా ! దయచేసి మీరు న న్నర్థం చేసుకోండి. ఆ భూములుంటే మీ కో ఆటంకం. భూమి భూమని, ఊరు ఊరని వెళ్తుంటారు. అక్కడే ఇల్లంటారు. వ్యవసాయ మంటారు. మీ ఆరోగ్యం వెనుకకు బడుతుంది. అన్నీ ఆలోచించే మే మీ పని చేశాం."

క్రోధంతో ముఖం ఎర్రబడగా లేచి నిల్చున్నాడు వెంకటయ్య.

"దొంగ... కొడుకా ! నువ్వు నాకు చెప్పిందేంటి? చేసిందేంటి?" కొడుకు నెన్నడూ ఒక్క తిట్టైనా తిట్టని వెంకటయ్య బండబూతులు తిడుతూ అన్నాడు.

తండ్రిని కొంత సేపు తిట్టనిచ్చాడు ఆనంద్.

"నాన్నా ! మీరు చెబితే వినరని అమ్మా, నేను ఆలోచించే వాలంటరీ తీసుకొమ్మన్నాం. మీ కీ వయసులో ఊరని, వ్యవసాయమని ఆరాటా లెందుకు చెప్పండి? మీకే ఇబ్బందీ కలుగకుండా చూసుకోవడం నా బాధ్యత. మాతో హాయిగా ఉండండి మీరు."

"ఇబ్బందంటే? హాయిగా ఉండడమంటే?" అరిచినట్టన్నాడు వెంకటయ్య.

"ఏంటండీ ఆనంద్ మీది కలా లేస్తున్నారు. ఉన్న ఇల్లు, పొలం మీ చెల్లె కప్పగించి అక్కడి కెళ్లి ఇల్లు కట్టుకొనుంటారా? పొలం కొని వ్యవసాయం చేస్తారా? భలే చిత్రమైన వారండీ మీరు. ఇలా అనే వాళ్లను మిమ్మల్నొక్కల్నే చూసిన.. ఉన్నొక్క కొడుకుతో, పిల్లలతో హాయిగా ఉండక ఆ పల్లెటూళ్లో ఉండడం దేనికి?" అంది రాధ.

"నువ్వే ఇదంతా చేసింది. గాడ్డి కొడుకా ! నువ్వు నా కడుపున చెడబుట్టావు. మీరు మోసగాళ్లు. రాక్షసులు. నా కింత ద్రోహం చేస్తారా? ఇలా మోసం చేసేబదులు నా కింత విష మిచ్చి చంపకపోయినారా?" ఏడుస్తూ, మొత్తుకుంటూ అన్నాడు వెంకటయ్య.

దగ్గరకు పోబోయిన కొడుకును, భార్యను "దూర ముండుండ్రి" అని గద్దరించాడు. కొద్ది సే పలాగే తండ్రిని చూస్తూ నిల్చున్నా డానంద్. తల పట్టుకుని మంచంలో కూర్చున్నాడు వెంకటయ్య.

కొద్ది సేపాగి అన్నా డానంద్.

"నాన్నా ! మీ రావేశపడకండి. అక్క డేముందని మీ కంత మమకారం?"

"అక్కడ మట్టుందిరా... మట్టి. మనందరికీ తిండి పెట్టే మట్టుంది. ఆ మట్టి నుంచొచ్చే పంటే లేకుంటే ఈ బంగ్లాలు, బంగారం తిని బతుకుతార్రా? ఏ మట్టి నుంచైతే వచ్చారో ఆ మట్టినే కాదంటున్నారు మీరు. మీ రసలు మనుషులు కారు." ఆవేశంతో రొక్క లెగిసిపడుతుండగా అన్నాడు వెంకటయ్య.

"నాన్నా ! మీ రూహించినట్టు పల్లెటూళ్లేం లే విప్పుడు. అక్కడా చెత్త రాజకీయాలు మొదలయ్యాయి. డబ్బుపై వ్యామోహం పెరిగింది. కుట్రలు, కుతంత్రాలూ ఉన్నాయి. వ్యవసాయం చేసి ఏమో పండిస్తాననుకోవడం భ్రమ" అన్నాడు ఆనంద్.

"ఊళ్లో గురించి నా కేమో తెలియదట. ఈ మొగోడు చెపుతుండు. ఎంతైనా కన్న తండ్రినే మోసం చేసేంత దగుల్బాజీతనం ఊళ్లో ఉందా?" కొడుకును దెప్పిపొడుస్తూ అన్నాడు వెంకటయ్య.

ఆనంద్ తల వంచుకున్నాడు.

"ఎంత పిచ్చోళ్లండీ మీరు. కృష్ణా రామా అనుకుంటూ ఇక్కడే హాయిగా ఉండక ఈ లొల్లంతా ఎందుకు? మీరేమన్న రవీంద్రనాథ ఠాగూర్ ననుకుంటున్నారా ఆ చేలల్లో శాంతి స్థాపించడానికి? లేక మథర్ థెరిసా ననుకుంటున్నారా ఆశ్రమం స్థాపించి సేవ చేయడానికి?" అంది రాధ.

భార్య మాటలతో మరీ ఆగ్రహోదగ్రుడయ్యాడు వెంకటయ్య.

"ఛీ... ఛీ ! వాళ్ల పేర్ల నుచ్చరించే అర్హత కూడా లేదు నీకు. మీ రసలు మనుషులేనా? నే నూరొస్తానంటే ఆరోగ్యం బాగాలేదన్న సాకుతో వద్దని న న్నింత మోసం చేస్తారా? మీరు చేనమ్మగానే చెల్లుతుం దనుకుంటున్నారా? నా డబ్బు కిచ్చేయండి. నేనే వెళ్లి కొనుక్కుంటాను." ఆవేశంగా అన్నాడు వెంకటయ్య.

"నాన్నా ! మీ రెందుకు మమ్మల్నర్థం చేసు

---

## బాలీవుడ్ బాణీ

### మమత కూడా అదే దారిలో...



ఎందుకో ఈ మధ్య హిందీ హీరోయిన్లలో చాలా మందికి అకస్మాత్తుగా జ్ఞానోదయం కలుగుతోంది. పరిగెత్తి పాలు తాగేబదులు నిలబడి నీళ్లు తాగడం మేలని, చాలా ఆలస్యంగా తెలుసుకుని, సినిమాల ఎంపికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిన్నటివరకూ మనీషా కోయిరాలా ఇలా జాగ్రత్తల జాబితాలో ఉంటే, నేడు మమతా కులకర్ణి కూడా ఇఁషులో చేరిపోయింది. పాత్ర నచ్చకపోవడం వల్ల మనీష ఇటీవల మహేష్‌భట్ సినిమా 'అంగారే' నుంచి మధ్యలోనే వాకౌట్ చేసి వెళ్లిపోయింది. మనీష ఆ పాత్రను తిరస్కరించినట్లు తెలిసి నేను మాత్రం తక్కువ తిన్నానా అని మమత కూడా వద్దని చెప్పేసింది. తాను అనుకున్నదానికన్నా తక్కువ పారితోషికాలు ఇవ్వడం వల్ల కూడా చిత్రాలు తగ్గించుకుంటున్నట్లు మమత చెబుతోంది. మమత తిరస్కరించిన పాత్రలో నటించడానికి భట్ కుమార్తె పూజా కూడా నిరాకరించిందట. మరి ఆ పాత్ర గతి ఏమి?

మసూద్ అన్సారి

కోరు. ఊళ్లిప్పుడు మునుపట్లా ప్రశాంతంగా ఏం లేవు. మా కక్కడుండటం ఇష్టంలేదు. మీ రొక్కరుంటానంటే మే మొప్పుకోం. అందుకే మీ రిచ్చిన డబ్బుతో రెండు నెలల క్రితమే జ్యోతినగర్‌లో ఇల్లు కొన్నాను. రిజిస్ట్రేషనవీ కూడా అయిపోయాయి. మీకు చెబితే సాగనివ్వరని చెప్పలేదు."

కొడుకు మాటలు విని మరీ దిగ్భ్రాంతి చెందాడు వెంకటయ్య.

ముప్పై ఏళ్లుగా తనతో కాపురం చేస్తున్న భార్య, తన రక్తం పంచుకుపుట్టిన కొడుకేనా వీళ్లన్నట్టుగా మతిభ్రమించిన వాడిలా చూస్తున్నాడు వాళ్లను. అతని కాళ్లు, చేతులు, శరీరమంతా వణికిపోతుంది. నిస్సహాయంగా పళ్లు పటపటా కొరికాడు వెంకటయ్య.

కళ్లు మూసుకున్నాడు.

'భగ్నమైంది. అంతా భగ్నమైంది. తన స్వప్నం భగ్నమైంది. ఇక నుంచి తాను వేళకింత తిండి కోసం ఎదురుచూస్తూ బతకాలి. ఈ రొదలో, ఈ కృత్రిమత్వంలో టీ.వీ.కి అంకితమై బతకాలి.'

ఇలా ఎందుకు జరుగుతుంది? తనను బలవంతంగా భూమికి దూరంగా లాక్కుపోతున్న శక్తులేంటి? ఏ అదృశ్య శక్తులు తనలాంటి వాళ్ల స్వప్నాలను భగ్నం చేస్తున్నాయి?

తనను తాను ప్రశ్నించుకుంటూనే ఉన్నాడు వెంకటయ్య.

మరికొన్ని రోజులు గడిచాయి. ఓ రోజు ఆఫీసు నుం చొచ్చిన ఆనంద్ తండ్రి ఇంట్లో లేకపోవడం చూసి తల్లి నడిగాడు.

"బయట కెళ్లొస్తానని పోయాడు. చాలా సేపైంది" అంది రాధ.

"ఎందుకు పోనిచ్చావమ్మా?" అని తల్లిని కోప్పడ్డాడు.

ఆనంద్ మనసు కీడును శంకిస్తుంది. తండ్రి కోసం ఊ రంతా తిరిగాడు ఆనంద్. తండ్రి తరచుగా పోయే అన్ని ఇండ్లకూ, ప్రదేశాలకూ పోయాడు. ఊ రెళ్లుంటాడని బస్టాండు కెళ్లాడు. ఆఖరి బస్సప్పటికే వెళ్లిపోయింది.

రాత్రంతా ఆందోళనతోనే గడిపాడు. తెల్లవారి మొదటి బస్సులోనే ఊరెళ్లా డానంద్. బస్సు దిగుతూనే పిడుగులాంటి వార్త విన్నాడు.

"నిన్న సాయంత్రమే ఇక్కడి కచ్చిండు మీ నాన్న. రాత్రి దాక పాత సోపతిగాల్ల నందర్ని కలిసిండు. మీ మేనత్తింట్లోనే అన్నం తిన్నడు. తమ ఇంట్లో పడుకొమ్మన్న ప్రతి వాళ్లతోనూ వేరే వాళ్లింట్లో పడుకుంటానని చెప్పిండు. తెల్లారెవర కిట్ల చేస్తడని ఎవ్వ లనుకున్నరు? ఈ బస్సుకు నీ దగ్గరికి మనిషిని తోలిద్దా మనుకుంటున్నం." ఆనంద్‌తో మాట్లాడుతూ చేల్లోకి తీసుకెళ్లారు ఊరివాళ్లు.

నడిచేల్లో బొర్లాపడి ఉన్నాడు వెంకటయ్య: అత్యంత ఆత్మీయమైన వస్తువును కౌగిలించుకున్నట్లుగా భూమికి అతుక్కుపో యున్నాడు. తన నా భూమి నుండి ఏ శక్తులూ వేరు చేయలేవన్నట్టుగ్గా కౌగిలించుకొనున్నాడు. మూసి ఉన్న అతని రెండు చేతుల్లోనూ మట్టుంది.

తండ్రి నా స్థితిలో ఊహించని ఆనంద్ శవంపై బడి భోరుభోరున ఏడుస్తున్నాడు. వెంకటయ్య చెల్లె తల కొట్టుకుంటూ మొత్తుకుంటుంది. ఆ ఊరి వాళ్ల కన్నీటి వరదతో ఆ నేల తడుస్తుంది.

వెంకటయ్య పాంటు జేబులో ఏదో కాగితం ఉన్నట్టు గమనించి ఏడుస్తూనే పైకి తీశాడానంద్.

ఆ కాగితంలోని అక్షరాల వెంట కదులుతున్న ఆనంద్ కళ్లు శరత్కాల మేఘాల్లా వర్షిస్తున్నాయి. అతని చేతులు వణుకుతున్నాయి.

ప్రియమైన ఆనంద్‌కు...

ఆశీస్సులతో...

నా జీవిత కాలమంతా భూమి కోసమే తపించాను. కారణాలేవైనా నా తపన తపనగానే మిగిలిపోయింది. మూడు తరాల్లోనూ నా భూమి స్వప్నాన్ని నిజం చేసుకోలేకపోయాను. నీ కాలంలోనైనా నా కల నిజమవుతుందనుకుని ఆశపడ్డాను. కానీ ఆ ఆశ నిరాశే అయింది. ఇందుకోసం నే నెవరినీ నిందించడంలేదు. నా స్వప్నాలను భగ్నం చేసిన శక్తులేవో నా కంతు పట్టడంలేదు.

మీకు దూరంగా పోయి నా స్వప్నాలను నిజం చేసుకోగలనన్న నమ్మకమున్నా అలా చేయడం నా కిష్టం లేదు. అందుకే నాకు జీవితంపై ఎంతో ప్రే మున్నా ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. నా స్వప్నాలన్నీ తునాతునకలైన తర్వాత ఎంత నాకు నేను సమాధానపరచుకున్నా బతకా లనిపించడంలేదు. అందుకే మిమ్మ ల్నందర్నీ వదిలిపెట్టి పోతున్నాను.

చదువుకున్నవాళ్లు, ఉద్యోగులైన వాళ్లు ఊరికి, భూమికి దూరం కావాలా? మీ నాన్న చివరి వాక్యాల గూర్చి ఒక్కసారి ఆలోచించు.

న న్నీ చేల్లోనే దహనం చేయి. నా చితాభస్మాన్ని నా ఊరి పొలాల్లో ముఖ్యంగా నా తండ్రి, తాతల పంట చేలల్లో చల్లు. అలాగైనా నా నేలతో మమేకమై, మట్టిలో కలిసిపోయి నా 'భూమి స్వప్నం' నిజం చేసుకుంటాను.

మీ నాన్న
వెంకటయ్య.

## రచయితలకు మనవి

"మేము ఒక రచన చేశాము. ప్రచురిస్తారా? ఎలా పంపించాలి?" అంటూ చాలామంది రాస్తూంటారు. రచయిత లందరూ తెలుసుకోవలసిన ముఖ్య సూచన లివి:

★ కథ రాసినా, కవిత రాసినా, వ్యాసం రాసినా, ఏ చిన్న అంశం రాసినా తెల్ల కాగితానికి ఒకపక్కే, స్పష్టంగా రాయాలి.

★ రచన సొంతమేనని, దేనికీ అనువాదం, అనుసరణ కాదని, ఇంతకుముందు మ రే పత్రికకూ పంపలేదని, ఏ రూపంలోనూ ప్రసారం కాలేదనీ హామీ పత్రాన్ని పంపాలి.

★ చిరునామా స్పష్టంగా రాయాలి. కలం పేరు ఉపయోగించినా అసలు పేరు కూడా విధిగా రాయాలి.

★ రచనలు మేము స్వీకరించనిపక్షంలో తిరిగి పంపడానికి తగినన్ని పోస్టల్ స్టాంప్‌లు అతికించిన కవరు జతపరచాలి. లేకపోతే తిప్పి పంపడం సాధ్యం కాదు.

★ కథలు ఆరు అరఠావు పేజీలకు మించరాదు. వ్యాసాలేవైనా రెండు అరఠావు పేజీలకు మించరాదు. నవలలైతే 250 పేజీల లోపునే ఉండాలి.

★ కార్టూన్‌లు పం పేవారు నల్ల సిరాను మాత్రమే ఉపయోగించాలి. ప్రతి కార్టూన్ వెనుకా చిరునామా తప్పనిసరి.

★ మీ రచనలు, చిత్రాలు, కార్టూన్‌లు వ్యక్తుల పేరిట కాక,

ఎడిటర్,
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
దోమల్‌గూడ, హైదరాబాద్ — 500 029

అన్న చిరునామాకు మాత్రమే పంపాలి. ప్రత్యేక శీర్షికలకు రా సేవారు ఆ శీర్షిక పేరు కవరుపై రాయడం అవసరం.